క్లుప్తంగా

పేదలకు అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం యాచకులు, పేదలకు అన్నదానం చేశారు. తన కుమారుని పుట్టిన రోజు సందర్భంగా సంస్థ సభ్యులు అయ్యూరి రమేష్ బాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మద్దూరి మోహన్, మనోహర్, రాజేష్, సుశీల్ బాబు, గోపాల్ పాల్గొన్నారు.

గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రూప్-2,3లకు సీపీటీని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు పాత పద్ధతిని అమలు చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు గంగా సురేష్, దస్తగిరి, దేవా రాహుల్, చైతన్య పాల్గొన్నారు.

ఆప్‌కీ అవాజ్ నగర కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆప్‌కీ అవాజ్ నూతన నగర కమిటీని ఎన్నుకున్నట్లు ఆప్‌కీ అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా వెల్లడించారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ అవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగర అధ్యక్షుడిగా సయ్యద్ అబిద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా ముస్తాక్, నగర ప్రధాన కార్యదర్శిగా హైదర్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల ఐక్యత కోసం రాబోయే కాలంలో అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరుచుకుంటూ ఉద్యమాలను చేపడతామని వివరించారు.

వంట గ్యాస్ ధరల పెంపు సరికాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వంట గ్యాస్ వినియోగదారులపై అధిక ధరలను పెంచి భారాలు మోపడం తగదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ. 50 పెంచడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రకాల ధరలను పెంచి సామాన్య ప్రజానీకాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికేఅసంఘటిత కార్మికులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు రోజు రోజుకు పెరుగుతున్న భారాలను భరించలేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, ఎంఆర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహవీర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని మహవీర్ సర్కిల్‌లో బుధవారం సాయంత్రం కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ద్విచక్రవాహనాలు, ఆటోలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలను విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలనీ లేకుంటే జరిమానాలు ఎస్ఐ హెచ్చరించారు.

యూటీఎఫ్ నాయకుల ధర్నా



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన యూటీఎఫ్ నాయకులపై డీఈఓ దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శులు రమణ, అహమద్, నాయకులు కరీముల్లా, గోపీనాథ్, కిరణ్ కుమార్, దేవదత్తం, సూర్యకుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కల్పించారు. బుధవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఉమన్ వింగ్ కో-ఆర్డినేటర్ విష్ణుమోహన్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్రికెట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్. సాజిత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరిద్దాం

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత



కడపలోని ప్రభుత్వ బాలుర గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప అర్బన్ : తల్లిదండ్రులను, వృద్ధులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి కుటుంబసభ్యునికి ఉందని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత అన్నారు. బుధవారం నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011 ను అవగాహన చేసుకోవాలనీ వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి దృష్టికి తీసుకురావచ్చన్నారు.

■ కడపలోని ప్రభుత్వ బాలురగృహంను జడ్జి సందర్శించారు. పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం-2015 గురించి వివరించారు. ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే కుట్ర

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్ర ప్రభుత్వం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న ఆరోపించారు. కడపలోని ఎస్టీయూభవన్‌లో బుధవారం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలు, కరువుభత్య బకాయిలు, భవిష్యనిధి, జీవితబీమా బకాయిలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రతి నెల 1న జీతాలు చెల్లించకుండా 15వ తేదీ వరకు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. దీంతో వ్యక్తిగత రుణాలు, నెలవారి వాయిదా చెల్లింపులకు బ్యాంకులకు ఫెనాల్టీ కట్టాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వచ్చిన తరువాత ప్రాంతీయ విద్యాధికారులు, జిల్లా విద్యాశాఖ దాడులు ఎక్కువయ్యామని ఆరోపించారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు అశోక్, ప్రకాసం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అప్పన ఏడుకొండలు, ఉమాపతి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నిక



కడప ఎడ్యుకేషన్ : ఒంగోలు వేదికగా ఫిబ్రవరి 26,27,28 తేదీల్లో జరిగిన 8వ రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కడప జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి గారికి, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి

వల్లూరు : విద్యార్థులు విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్రస్వామి తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఏకాగ్రత, శ్రద్ధలతో ఒత్తిడిని జయించినప్పుడు లక్ష్యాన్ని చేరుకోవచ్చునని సూచించారు. ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు పాఠశాల ప్రణాళికలతోపాటు మీ సొంత ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో వైవీయూలో రీజినల్ క్విజ్ చాంపియన్‌షిప్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 3, 4 తేదీల్లో ప్రాంతీయస్థాయి క్విజ్ చాంపియన్‌షిప్-23 నిర్వహించనున్నట్లు వైవీయూ ఆంగ్లశాఖ సహ ఆచార్యులు, క్విజ్ చాంపియన్‌షిప్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్, ఏపీ ఉన్నత విద్యామండలి క్విజ్ సమన్వయకర్త ఎం. రమేష్‌కుమార్ తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి మార్గదర్శకం మేరకు క్విజ్ పోటీలకు రాయలసీమ, నెల్లూరు జిల్లాలలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 33 టీంలు హాజరవుతున్నట్లు తెలిపారు. క్విజ్ పోటీలను ప్రిలిమ్స్, క్వాలిఫైయింగ్, క్వార్టర్ ఫైనల్స్‌గా మూడుదశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రీజినల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఏపీ ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సెమీఫైనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డ్వామా ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రతిరోజు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పని ప్రదేశం నుంచి తప్పని సరిగా రెండు ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారథి, ఈసీ అన్నానాయక్, టీఏలు శ్రీనివాసులు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్యే



సంతానమల్లేశ్వరస్వామి వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : పుష్పగిరి పుణ్యక్షేత్రంలోని కొండపైన గల ఆలయాలను ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి, ఈఓ మహేశ్వరరెడ్డిలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చెన్నకేశవస్వామి, సంతాన మల్లేశ్వరస్వామి, శ్రీలక్ష్మీదేవి అమ్మవారి ఆలయాలను ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పాకా సురేష్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఆర్‌వీఎస్‌ఆర్, ఎంపీపీ సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి

వేంపల్లె : ఉచిత డ్రైవింగ్ శిక్షణలో ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవడంతోపాటు పాటించాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర తెలిపారు.

బుధవారం వేంపల్లెలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభయ ఫౌండేషన్, చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామని.. ఉచిత శిక్షణతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ నిర్వాహకులు రామాంజనమ్మ, ఈశ్వరయ్య, నాగేంద్ర, విజయ్‌కుమార్, డ్రైవింగ్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ గోవిందనాయక్

బద్వేలు అర్బన్ : విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.గోవిందనాయక్ తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని కళాశాల బాలుర వసతిగృహంలోని విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై ఆయన 1అవగాహన కల్పించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వాడకం వలన యుక్తవయస్సులో శక్తి నిర్వీర్యం అవడంతో పాటు ఆలోచన విధానం సన్నగిల్లడం, చదువుపై ధ్యాస తగ్గడం వంటివి ఏర్పడతాయని తెలిపారు. మొదటిసారేలే.. ఒకసారి తీసుకుంటే ఏమవుతుందిలే అని సరదాగా మత్తుకు అలవాటై చివరికి మత్తు నుంచి బయటపడలేక నిండు జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే చివరకు కుటుంబ బాంధవ్యాలు దూరమవుతాయన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండి లక్ష్యం దిశగా అడుగులు వేయాలని కోరారు. అలాగే ఎక్కడైనా మత్తుపదార్థాలు గాని, మాదకద్రవ్యాలు గాని గుట్టుగా విక్రయిస్తుంటే ఎస్ఈబీ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మురళీమోహన్, వసతిగృహం సంక్షేమాధికారి సుభాష్‌చంద్ర, ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విశ్వేశ్వరస్వామి కల్యాణం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో శుక్రవారం విశాలక్ష్మి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సిద్దవటం ఉమామహేశ్వర శర్మ తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, రుద్రాభిషేకం, 10 గంటలకు కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

బద్వేలు అర్బన్ : ఈనెల 7వ తేదీన హోలీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరి ప్రదర్శనకు బద్వేలు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ రాత్రి 8 గంటలకు పోరుమామిళ్ల బస్టాండు నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక బస్సు బద్వేలులో రాత్రి 9 గంటలకు మళ్ళీ బయలుదేరుతుందని, 7వ తేదీ ఉదయం 5 గంటలకు తిరువణ్ణామలై (అరుణాచలం)కు చేరుకుని గిరి ప్రదర్శన తర్వాత అదే రోజు రాత్రి 9 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరుతుందని తెలిపారు. కావున బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక బస్సుకు బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు బద్వేలు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠను టీబీహెచ్‌ఎల్‌సీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శ్రీకమలానంద భారతీస్వామి పీఠాధిపతుల వారిచే ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. విగ్రహప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన బండలాగుపోటీల్లో నంద్యాల జిల్లాలోని కొట్టాల గ్రామానికి చెందిన ఎద్దులకు ప్రథమ బహుమతి రూ.80 వేలు, ద్వితీయ బహుమతి ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కల్లూర్ గ్రామానికి చెందిన ఎద్దులకు రూ. 70 వేలు, తృతీయ బహుమతి రూ.60 వేలు కృష్ణాజిల్లాకు చెందిన ఎద్దులు గెలుపొందాయి.

స్వచ్ఛంద సేవకుడు కరుమూరు వెంకట రమణయ్య మృతి



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు, చైతన్య సాంఘిక సేవా సంఘం అధ్యక్షుడు కరుమూరు వెంకట రమణయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, బీసీ నాయకుడిగా సేవలందించారు. చైతన్య సాంఘిక సేవా సంఘం ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలు, పేదలకు దుప్పట్లు, వస్త్రాలను అందించేవారు. రామేశ్వరంలోని రమణయ్య ఇంట్లో ఆయన మృతదేహానికి రచయిత జింకా సుబ్రహ్మణ్యం, సీపీ సాధు గోపాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కరరాజు, దేవీ సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి బుధవారం రాత్రి తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉండే వ్యక్తులు ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని లాడ్జీ నిర్వాహకులకు సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

సిద్దవటం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన స్టాఫ్ నర్సులు తులసి, రామాంజులమ్మ, చిన్న స్థాయి ఉద్యోగులు చంద్ర, పెంచలమ్మ, చెన్నమ్మ వారి సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించామన్నారు. ఎక్కడికి బదిలీ అయిన ఉద్యోగులు తమ పనిని వంద శాతం నిబద్ధతతో చేయాలని తెలిపారు. ఆసుపత్రికి వీరు చేసిన సేవలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శశికుమార్, మహిళా వైద్యాధికారులు, నర్సులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లు, సిక్కర్లను బుధవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ ఆపస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. జిల్లా మీడియా ఇన్‌చార్జ్ బాలకృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ పోటీలు

కడప కల్చరల్ : రెడ్డి సేవా సమితి కడపశాఖ ఆధ్వర్యంలో మహిళలకు వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించనున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. ఈనెల 11న రాజీవ్‌మార్గ్‌లోని తమ కార్యాలయంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. కడప నగరానికి చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. వక్తృత్వ పోటీలో ఒకప్పుడు భారతదేశం ప్రపంచ శక్తిగా వెలుగొందినది-భవిష్యత్తులో మరలా ప్రపంచ శక్తిగా మారగలదా అది ఎలా? అనే అంశంపై మాట్లాడాల్సి ఉంటుందని, వ్యాసరచనను విలువలతో కూడిన విద్య అంశంపై రాయాల్సి ఉంటుందన్నారు. డిబేట్ పోటీల్లో నేటి సామాజిక మాధ్యమాలు-మానవునికి వరమా? శాపమా? అనే అంశంపై పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇద్దరు కలిసి ఒక జట్టుగా పాల్గొనాలని, ఒకరు అనుకూలంగా, మరొకరు ప్రతికూలంగా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 5లోగా తమ పేరు, కళాశాల, సెల్ నెంబరు, పోటీ చేసే అంశం తదితర వివరాలతో 94406 51284 లేదా 94405 23484 నెంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు కేవలం మహిళలకు మాత్రమేనని, ఆసక్తిగల వారు తమ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన లెటర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వ్యాసరచనకు 40 నిమిషాలు, వక్తృత్వ పోటీ, డిబెట్‌లకు నాలుగు నిమిషాల సమయం ఇస్తామని, మార్చి 12న బహుమతి ప్రదానం ఉంటుందని వివరించారు.

అర్హులందరికీ పింఛన్ అందించాలి



మార్నింగ్ విజిట్‌లో భాగంగా రవీంద్రనగర్ వాసులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : పింఛన్ జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇంటి వద్దకే పోయి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 42వ డివిజన్‌లోని రవీంద్రనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించి, కార్మికుల మస్టర్‌ను తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు పింఛన్ సమస్యల గూర్చి వివరించగా ఆ సమస్యలు ఇకపై రాకుండా చూడాలని వలంటీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కార్పొరేటర్లు కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మాసీమ బాబు కోరారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో జేసీఎస్ ఇన్‌చార్జులు, కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు 12 రోజులు మాత్రమే ఉందని, ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లను గుర్తించాలన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు పాకా సురేష్ కుమార్, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు జమాల్‌వలీ, చల్లా రాజశేఖర్, రెడ్డి ప్రసాద్, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమలాపురంలోని నిరుద్యోగ యువతకు ఇస్తున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక లక్ష్మీ దుర్గ డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో ఎంపిక చేసిన నిరుద్యోగులకు సమావేశం నిర్వహించి ఉచితంగా టీ షర్టులు వారికి అందజేసి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఏదో ఒక రంగంలో శిక్షణ నిచ్చి వారికి ఉపాధి కల్పించడమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగా కమలాపురం మండలానికి చెందిన 16 మందికి ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డ్రైవింగ్‌లో శిక్షణ పొంది ఉపాధి పొందాలన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన పేద యువత అభ్యున్నతి కోసం అభయ ఫౌండేషన్ ఎన్నో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అందులో భాగంగా మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కలసి రావడం శుభపరిణామం అన్నారు. నిరుద్యోగులు క్రమశిక్షణ, పట్టుదలతో మంచి నైపుణ్యం సాధిస్తే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ అధినేత సుబ్బరాజు, ఎస్‌కే, జీఎస్‌పీవీ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎస్‌కే లెనిన్‌బాబు, ఉమాదేవి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

సిద్దవటం : పంచలింగాల స్వామి ఆలయ ఆవరణలో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను బుధవారం తొలగించామని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులకు పంచలింగాల వద్ద దాతలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను దృష్టిలో ఉంచుకొని అక్కడ భక్తులు పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, విస్తర్లు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను తదితర వ్యర్థ పదార్థాలను అటవీశాఖ అధికారులు పర్యవేక్షణలో ప్రధాన రహదారిలో, వాగులు, వంకల్లో, కోనేరు వద్ద కూలీలతో తొలగించి శుభ్రంగా చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండారెడ్డి, ఆలయ ఉద్యోగి చంద్ర, అటవీశాఖ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించండి



తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని జ్యోతి గొల్లపల్లె గ్రామంలో రామాలయం నిర్మాణానికి స్థలం కేటాయింపులో సమస్య లేకుండా పరిష్కరించాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దారు శంకర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో రామాలయ నిర్మాణానికి స్థలం విషయమై పలుమార్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అంతేగాకుండా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. తహసీల్దారు మా సమస్యను పరిష్కరించాలని వారు వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పశు విజ్ఞానబడి సందర్శన



పశువులకు టీకాలు వేయిస్తున్న డాక్టర్ శ్రీనివాసులరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని దాసరిపల్లెలో బుధవారం నిర్వహించిన పశువిజ్ఞాన బడిని జిల్లా పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మండల వెటర్నరీ అధికారులకు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో ప్రబలుతున్న గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించి పశువులకు ముందస్తుగా గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు వేయించారు. అనంతరం ఆయన టేకూరుపేట వెటర్నరీ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పశువైద్యులు డాక్టర్ శివశ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.